అసలు సాధన ఎవరు చేస్తున్నారు? మనస్సే చేస్తోంది. అదే పెద్ద దొంగ, అదే పెంట. దానిని మాయం చెయ్యండి. పీడవదిలిపోతుంది. సాధన చేసేవాడిని మాయం చేయండి. వాడు నిజం అనుకొంటున్నాము. వాడిని వాడి మూలంలోనికి పంపితే కాని వాడు నిజంకాదు అన్నసంగతి మనకు తెలియదు. మనోమూలంలో ఉన్న చైతన్యానికి పరిమితులు లేవు. మనం పరిమితులలో ఉన్నాము అంటే మనస్సులో ఉన్నట్లు. మన మనస్సును ఎప్పుడైతే హృదయంలో మాయం చేసావో అప్పుడు ఉన్నది చైతన్యం ఒక్కటే, అది తప్ప ఇంక ఏమీ లేదు అన్న సంగతి నీకు తెలుస్తుంది, ఆ అనుభవం నీకు వచ్చినప్పుడు నువ్వు శాంతిసాగరంలో, ఆనందసాగరంలో ఊగిసలాడతావు. అప్పుడు ఎటుచూసినా ఆనందమే, ఎటుచూసినా శాంతే, ఎటుచూసినా సుఖమే.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 21-12-2002. జిన్నూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈ రోజు శ్రీ రమణజయంతి. భగవాన్ శ్రీరమణమహర్షి 1879వ సంవత్సరం డిసెంబరు 30వ తేదీన తిరుచ్చుళిలో జన్మించారు. ఆయన తండ్రి సుందరమయ్యర్, తల్లి అళగమ్మ. వారి కుటుంబానికి ఇష్టదేవత వెంకటేశ్వరస్వామి అందుచేత భగవాన్‌కు వేంకట్రామన్ అని పేరు పెట్టారు. భగవాన్ చిన్నతనంలోనే ఆయన తండ్రి స్వర్గస్తులైనారు. తండ్రిపోయిన తరువాత భగవాన్‌ను ఆయన పినతండ్రి మధురాయి తీసుకొని వెళ్లారు. భగవాన్ పినతండ్రి ఇంటివద్ద ఉండి చదువుకొనేవారు. ఆయన ఒకరోజు స్కూలు నుండి వస్తూ ఉంటే ఒక బంధువు ఎదురు వచ్చాడు. ఎక్కడ నుండి వస్తున్నావు అని అడిగితే అరుణాచలం నుండి వస్తున్నాను అని చెప్పాడు. మొదటిసారి అరుణాచలంపేరు విన్నంతనే ఆయనకు శరీరం అంతా గగుర్పాటు వచ్చేసింది, అది జన్మాంతర అనుబంధం. అరుణాచలం అంటే ఆయనకు ఊరుగుర్తుకురాలేదు. అరుణాచలం అంటే భగవంతుడే, మన తండ్రే అనుకొన్నాడు. ఆయనకు జన్మాంతరంలో శివసంస్కారం ఉంది. శివుడు అంటే మనం దేవుడు అనుకొంటాము. ఆయనకు శివస్మరణ వచ్చేసరికి ఆయన మన తండ్రే, ఆయన మనం ఒకటే కుటుంబం అనిపించేది. అరుణాచలంతో ఆయనకు ఉన్న జన్మాంతర



అనుబంధం ఎటువంటిది అంటే 54 సంవత్సరములు అరుణాచలంలో ఉంటే ఈ అరుణాచలం వదిలిపెట్టి ఎక్కడికైనా వెళ్లాలి అనే తలంపు కూడా రాలేదు అని చెప్పాడు. భగవాన్ పెరియపురాణం అనే ఆధ్యాత్మిక గ్రంథం చదివారు. అందులో 63 మంది శివభక్తుల జీవిత చరిత్రలు ఉన్నాయి. ఈ 63 మంది భక్తులలో ఒకరిగా నేను అవ్వగలనా అనే భావన భగవాన్‌కు లోపలనుండి వచ్చింది. ఆయన జీవితంలో ముఖ్యమైన సంఘటన మరణానుభవం. 1896 సం॥రం జూలై 16వ తేదీన మధురైలో ఆయన పినతండ్రి ఇంటివద్ద భగవాన్‌కు మరణానుభవం కలిగింది. మామూలుగా శరీరం మరణించింది, శ్వాస ఆగిపోయింది, రక్త ప్రసరణ ఆగిపోయింది. శరీరం మరణించినప్పుడు నేను మరణించాలి కదా, నేను మరణం లేకుండా ఉన్నాను ఏమిటి? మరణించేది దేహమే, దేహం పోయిన తరువాత కూడా మనం ఉంటాము అని అనుభవపూర్వకంగా గ్రహించాడు. మరణానుభవం ద్వారా మరణాన్ని జయించాడు. మరణానుభవంలో దేహగతమైననేను విడిచిపెట్టేసింది, ఆత్మగతమైననేను ఆయనకు వ్యక్తమయింది. ఇది అంతా 10 నిమిషాల కాలంలో జరిగిపోయింది. మరణానుభవం ద్వారా పూర్ణజ్ఞాని అయి కూర్చొన్నాడు. మరణానుభవం ఎలా కలిగింది అంటే అది దేవరహస్యం. అంతకు ముందే ముగ్గిపోయి ఉంటాడు, అప్పుడు రాలిపోయాడు. మనం కూడా ఈ జన్మలో కష్టపడి సాధన చేస్తే ఇప్పుడు ఆత్మానుభవం కలగకపోయినా మనం చేసిన సాదన రాబోయే జన్మకు కలిసి వస్తుంది. టీనేజ్ వరస్టు ఏజ్ అంటారు, అటువంటి టీనేజ్‌లో భగవాన్‌కు మరణానుభవం కలిగింది. ఆయనకు ఆత్మానుభవం కలిగిన తరువాత సమాధిస్థితి వరించి వస్తూ ఉంటే ఆయన అన్నగారు ఏమన్నారుఅంటే నీబోటివాడికి ఇంటిదగ్గర పని ఏముంది, ఎక్కడికైనా పోరాదా అంటే ఆయనకు కోపం రాలేదు, నిజమే ఎక్కడికి పోవాలి? లోపలనుండి అరుణాచలం, అరుణాచలం అనే తలంపు వచ్చింది. మరి డబ్బు ఎక్కడిది? అప్పుడు అన్నగారి నోరును ఈశ్వరుడు ఉపయోగించుకొన్నాడు. ఫలానా చోట డబ్బు ఉంది తీసుకొని నా కాలేజీ జీతం కట్టు అన్నాడు. ఇచ్చేవాడు ఈశ్వరుడు, పుచ్చుకొనేవాడు ఈశ్వరుడు. కొంత డబ్బు తీసుకొని ఇది ఒక మంచిపని నిమిత్తం పోతోంది, ఈ శరీరం కోసం వెతకవద్దు, డబ్బు ఖర్చుపెట్టవద్దు, దీనికోసం బెంగపెట్టుకోవద్దు అని వ్రాసి క్రింద సంతకం పెట్టలేదు. మరణానుభవంలో సంతకం పెట్టేవాడు చనిపోయాడు. 1896 సంవత్సరం సెప్టెంబరు 1వతేదీ ఉదయం అరుణాచలం చేరుకొన్నాడు. అరుణాచలం వచ్చిన తరువాత వేగంగా

వెళ్ళి అరుణాచలేశ్వరుని దర్శనం చేసుకొన్నాడు. అరుణాచలేశ్వరునితో నువ్వు రమ్మంటే వచ్చాను, నా అంతట నేను రాలేదు, ఈ శరీరాన్ని ఎలా ఉపయోగించుకోవాలో అలా ఉపయోగించుకో అని విన్నవించుకొన్నాడు. ఆయనకు ఆయనే సన్యాసంపుచ్చుకొన్నాడు. చొక్క చింపిఒక ముక్క గోచీ పెట్టుకొన్నాడు, లాగు, చొక్కా, తన దగ్గర ఉన్నడబ్బు, మిఠాయిలు అన్నీ కొలనులో వేసాడు అంటే పరిపూర్ణంగా ఈశ్వరుడి మీద ఆధారపడిపోయాడు. అది శరణాగతి అంటే. శరణాగతిగురించి చెప్పటం వేరు. శరణాగతిగా ఉండటం వేరు. భగవాన్ కొంతకాలం గుడిలో పాతాళగుహలో ఉన్నారు. తరువాత మామిడితోటలో, పవలకున్రులో కొంతకాలం ఉన్నారు. అక్కడ ఉండగానే వాళ్ళ అమ్మగారు వచ్చి ఇంటికి రమ్మని అడుగుతారు. భగవాన్ వారి అమ్మగారికి పలకమీద ఒక మాట వ్రాసి ఇచ్చారు. ఈశ్వరుడు జీవులను వారివారి ప్రారబ్దముననుసరించి ఆడిస్తున్నాడు, జరగవలసినది జరిగే తీరును, జరుగరానిది ఎవరు ఎంత ప్రయత్నం చేసినా జరుగనే జరుగదు, ఇది నిశ్చయము, ఊరక ఉండటం ఉత్తమం. ఇది భగవాన్ చెప్పిన మొదటి సందేశం. తరువాత భగవాన్ కొంతకాలం విరూపాక్షగుహలో ఉన్నారు. 1907 సంవత్సరంలో అక్కడకు గణపతిశాస్త్రిగారు వచ్చారు. శాస్త్రిగారు భగవాన్‌ను దర్శించి చదవవలసిన శాస్త్రాలు అన్నీ చదివాను, జపం చేసాను, తపస్సు చేసాను కాని తపస్సు యొక్క రహస్యం నాకు తెలియలేదు అన్నారు. భగవాన్ చాలా తక్కువ మాట్లాడేవారు. తన గొంతుని సవరించుకొని మనం నేను, నేను అంటున్నాము కదా అది ఒక తలంపు. ఆ నేను అనే తలంపు ఎక్కడ ఉదయించి వస్తోందో అక్కడకు వెళ్ళాలి అదే తపస్సు యొక్క ప్రయోజనం. నేను అనే తలంపు ఎక్కడయితే ఉదయించి వస్తోందో ఆ హృదయాకాశం దగ్గరకు వెళితే ఇది నశిస్తుంది, అక్కడ ఉన్న వస్తువు తానుగా వ్యక్తమవుతుంది. ఓ అరుణాచలేశ్వరుడా, నువ్వు అంతటా ఉన్నావు, హృదయాకాశంలో కూడా ఉన్నావు. నీవు ఏమి చేస్తావు అంటే, హృదయాకాశంలోనికి నన్ను తీసుకొని వెళ్ళి నీలో ఐక్యం చేసుకొన్నావు అనుకో ఈ తలంపుల పీడ, సంసారం పీడ, రాగద్వేషముల పీడ, జననమరణాల పీడ అంతా వదిలిపోతుంది. హృదయాకాశంలోనికి మూలతలంపును తీసుకొనివెళ్ళి నీ అనుభవాన్ని కలుగజేస్తే అది నశిస్తుంది, అది నశిస్తే ఇంక కోరికలు లేవు, బంధాలు లేవు, తలంపులు లేవు, దుఃఖం లేదు. మనకు మంచితలంపులు వచ్చినా చెడుతలంపులు వచ్చినా ఇవన్నీ అహంభావనకే వస్తున్నాయి. ఈ తలంపులు ఆగమంటే ఆగుతాయా? ఆగవు మూలతలంపు వెళ్ళి హృదయాకాశంలో



కలిస్తే అవి ఆగుతాయి. నువ్వు అంతటా ఉన్నావులే కాని ముందు ఈ పని చూడు. నువ్వు అనుభవంలోనికి వచ్చాక ఇక్కడ ఉన్నవాడే అంతటా ఉన్నాడు వాడే వీడు అనే అనుభవం సహజంగానే వచ్చేస్తుంది. వినాయకుడు, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి విగ్రహాలకు పళనిస్వామి ఆరాధించేవాడు. భగవాన్ అప్పడు తోటలో ఉండేవారు. ఈ విగ్రహాలను ఆరాధిస్తున్నావు ఏమిటి ఈ విగ్రహమే అక్కడ శరీరంతోటి ఉంది అంటే అప్పడు పళనిస్వామి వచ్చి భగవాన్‌కు సేవచేయటం ప్రారంభించారు. పళని స్వామి భిక్ష చేసుకొని వచ్చి సగం భగవాన్, సగం ఆయన ఇద్దరూ తినేవారు. భగవాన్ నీడ పళనిస్వామి. శాస్త్రిగారు వచ్చినప్పడు పళనిస్వామిని ఈయన పేరు ఏమిటి అని అడుగుతారు. మాకు తెలియదు కొంతమంది బ్రాహ్మణస్వామి అంటారు, తల్లిదండ్రులు పెట్టిన పేరు వెంకట్రామన్ అంటాడు. అప్పడు శాస్త్రిగారు రమణమహర్షి అని పేరు పెట్టారు. అందరూ రమణమహర్షి అని పిలుస్తారు కాని భక్తులుమటుకు భగవాన్ అని పిలుచుకోండి అని శాస్త్రిగారు చెప్పారు. నీటి ఇబ్బంది వలన భగవాన్ విరూపాక్షగుహ వదలి స్కందాశ్రమం వెళ్ళారు కాని పళనిస్వామి విరూపాక్షగుహను వదలివెళ్ళలేదు. నువ్వు విరూపాక్షగుహను వదలనంటున్నావు అయితే నేనే నిన్ను చూడటానికి వస్తాను అన్నారు భగవాన్, వాడు గురువు. ప్రతీరోజు పళనిస్వామిని చూడటానికి భగవాన్ విరూపాక్ష గుహకు వచ్చేవారు. కోరిక ఎంత బలీయమైనదో చూడండి. పళనికి చావుదగ్గరకు వచ్చేస్తోంది, జ్వరం ఎక్కువగా వచ్చేది. ఒక భక్తుడు పళనికి మామిడిపండు తెచ్చి ఇచ్చాడు. పళని గొప్ప వైరాగ్యపురుషుడు. అంతటి వాడికి కూడా ఆ జ్వరంలో మామిడిపండు తినాలనిపించింది. ఇదే మాయ. అందుచేతనే భగవంతుడు గీతలో చెప్పాడు నా పాదాలను ఆశ్రయించకుండా కేవలం నీ తెలివితేటల వలన మాయను జయించలేవు. నా పాదాలను ఆశ్రయిస్తే నువ్వు మాయలోనుండి బయటపడతావని చెప్పాడు. పళని మామిడిపండు తినటానికి శుభ్రంగా కడుగుకొన్నాడు, నోట్లో పెట్టుకొందామని అనుకొంటున్నాడు ఇంతలో భగవాన్ వచ్చారు. ఆయన వచ్చే శబ్దం విని, ఆయన వెళ్ళిపోయిన తరువాత తిందామని మామిడిపండును దాచేసాడు. భగవాన్ పళనితో జ్వరం తగ్గటం లేదు ఏమిటి అని అడుగుతూ ఇక్కడ మామిడి పండు వాసన వస్తోంది ఏమిటి అని అడిగారు. అంత వైరాగ్యపురుషుడు కూడా పండు లేదని అబద్ధం చెప్పాడు. ఇదే మాయ అంటే. భగవాన్ వాసన వస్తోంది ఏమిటి అని అంతా వెతికి మామిడిపండు దొరికింది అని, ఆ పండును పళని ప్రక్కన కూర్చొని తినేసి టెంకకూడా నాకేసి బయట పడేసి

వెళ్ళిపోయారు. మామిడి పండు తింటే ఫళనికి జ్వరం ఎక్కువైపోతుంది, పండు తినవద్దు అంటే మానేలా లేడు అందుకే భగవాన్ తినేసారు. 1922 సంవత్సరంలో తల్లిగారు శరీరం వదిలిపెట్టారు, తల్లి శరీరాన్ని కొండపాదం దగ్గర సమాధి చేసారు. తరువాత ఒకరోజున స్కందాశ్రమం నుండి క్రిందకు వచ్చిన భగవాన్ తిరిగి పైకి రాకుండా తల్లి సమాధి దగ్గర ఉండిపోయారు. స్కందాశ్రమం నుండి క్రిందకు నా అంతట నేను రాలేదు, ఏదో మహత్తర శక్తి నన్ను ఇక్కడకు తీసుకొనివచ్చింది అన్నారు. అక్కడే రమణాశ్రమం ఏర్పడింది. ఆయన భక్తులకు అందరకూ అందుబాటులో ఉండేవారు. 1950 సంవత్సరం ఏప్రియల్ 14వ తేదీన ఆయన శరీరాన్ని విడిచిపెట్టారు.

పెదవులతో భగవంతుడిని స్తోత్రం చేయటం కంటే భగవదనుభవం పొందటానికి భగవంతుడు చెప్పినట్లు చేతులతో పనిచేయటం మంచిది. శరీరం స్మశానంలో దగ్ధమవుతుంది కాని మనస్సు శుద్ధ చైతన్యంలో దగ్ధమవ్వాలి. కాసేపు జ్ఞాపకం వచ్చింది అంటావు, కాసేపు మర్చిపోయానుఅంటావు కాసేపు దుఃఖంగా ఉంది అంటావు, కాసేపు సంతోషంగా ఉంది అంటావు, ఇదంతా అపరిశుద్ధ మనస్సు అన్నారు భగవాన్. సంసారం అంటే నీ అపరిశుద్ధ మనస్సే సంసారం. అది హృదయాకాశంలోనికి వెళితేగాని దగ్ధం అవ్వదు. శరీరం ఉన్నంతకాలం ఏదో రోగం వస్తుంది, అలాగే మనస్సు ఉన్నంతకాలం ఏదో కోరికలు వస్తాయి. శరీరం కాలిపోయిన తరువాత ఇంక రోగాలు లేవు, అలాగే మనస్సు హృదయాకాశంలో దగ్ధమయిన తరువాత ఇంక కోరికలు లేవు. అప్పుడు కాని జననమరణ ప్రవాహంలోనుండి విడుదల పొందలేవు. మనవి అన్నీ దొంగ చావులు, దొంగ పుట్టుకలు. రోజూ పుట్టి రోజూ చనిపోయే వారిది నిజమైన పుట్టుకలు కాదు, ఇవి అన్నీ కల్పితములు. ఎవడైతే తిరిగి పుట్టడో వాడు నిజంగా చనిపోయినట్లు. మనం అబద్దం, అబద్దంగా చనిపోతున్నాము అంటున్నారు ఆచార్యులవారు. నిన్ను నీవు చూసుకొని లోకాన్ని చూడు అన్నారు భగవాన్. నిన్ను నీవు చూసుకోకుండా లోకాన్ని చూస్తే బంధింపబడతావు, మాయలో పడిపోతావు, నిన్ను నీవు చూసుకొని లోకాన్ని చూస్తే అంతటా నీవే కనబడతావు. నువ్వు దేనినైతే తెలుసుకోవాలనుకొంటున్నావో ఆ విషయంలో అజాగ్రత్తగా ఉండకు. నీ అజాగ్రత్తే జననమరణాలకు కారణమవుతుంది. నీ మనస్సుకు దాని మూలం తెలిసే వరకు ఏదో ఒక దానితో తాదాప్యం పొందుతూ ఉంటుంది, కానిదానితో తాదాప్యం పొందటం మానదు, అదే సంసారం. నువ్వు కానిదానితో తాదాప్యం తగ్గించుకోవటానికే యోగం అవసరం. లోపల ఉన్న బ్రహ్మం ఎంత పవిత్రంగా ఉందో అంత పవిత్రత నీ మనస్సుకు వస్తే గాని అది తదాకారం చెందదు. మనకు నేను అనేటప్పటికి దేహం స్ఫురిస్తుంది, జ్ఞానికి నేను అనేటప్పటికి బ్రహ్మం స్ఫురిస్తుంది. దానికి చావు లేదు కాబట్టి నేను పోను అన్న సంగతి వాడికి అనుభవంలో తెలుస్తూ ఉంటుంది. మన అహంకారాన్ని మనం మర్చిపోయేదీ లేదు, మనకు ఆత్మజ్ఞానం వచ్చేదీ లేదు. మిమ్మల్ని మీరు మర్చిపోవటం ప్రారంభిస్తే మీకు దేనితోటీ తాదాప్యం ఉండదు. ఉన్నది శివుడు, లేనిది జీవుడు. మనం శివుడు లేడు, జీవుడు ఉన్నాడు అనుకొంటున్నాము. భగవంతుడు ఉన్నాడు అని మనకు నిశ్చయం రావాలి, నిశ్చయం వస్తే గాని హృదయంలోనికి దారికనబడదు. కంచి పరమాచార్యులు ఒకనితో ఇప్పుడు నీవు ఎలాగ ఆలోచిన్నున్నావో అలాగ ఆలోచించకు, నీ ఆలోచనలో క్రమంలేదు, నువ్వు ఎలాగ మాట్లాడాలనుకొంటున్నావో అలాగ మాట్లాడవద్దు. నువ్వు ఎలాగ ఆలోచిస్తున్నావో అలాగ ఆలోచిస్తే, నీవు ఎలాగ మాట్లాడాలి అనుకొంటున్నావో అలాగ మాట్లాడితే నీ స్వరూపానికి దూరమవుతావు అని చెప్పారు. నీ హృదయగుహలోనికి వెళ్లటానికి సహకరించేలాగ ఆలోచించు, మాట్లాడు అంతేగాని నీవు అనుకొన్నట్లు మాట్లాడవద్దు అని చెప్పారు. నీకు లోపల అహంకారం ఉంటుంది కాని లేదని నీవు అనుకొంటున్నావు. స్థూలరూపంలో లేకపోయినా సూక్ష్మరూపంలో ఉంటుంది. గురువు చెప్పిన మాటయందు మనకు నమ్మకం లేదు, అది మన దురదృష్టం. అహంకారం నీలోపల సూక్ష్మరూపంలో ఉంటుంది. ఉన్నదానిని నీవు లేదు అనుకోవటం వలన ప్రమాదంలోపడతావు కాబట్టి లోపల ఉన్న అహంకారాన్ని కెలికి, పెద్దది చేసి, దానిని గుర్తించేటట్లు చేసి, దానిని తొలగించుకోవటానికి నీకు శక్తిని ఇస్తాడు. వాడు గురువు. నీకు ఆత్మవిశ్వాసం ఎలా పెంచాలో, నీ జీవితాన్ని ఎప్పుడు ఎలా మలుపు తిప్పాలో గురువు చూసుకొంటూ ఉంటాడు.

రాగద్వేషములతో మిశ్రితమైనటువంటి, జననమరణములతో మిశ్రితమైనటువంటి ఈ సాగరంలో నుండి బయటపడాలంటే ఒకటే ఉపాయం ఉంది, అంతటా వ్యాపించి ఉన్న వస్తువు, చైతన్యం నీకు వ్యక్తమవ్వాలి. చైతన్యం నీకు వ్యక్తమయినప్పుడు ఈ రుగ్మతలనుండి, అజ్ఞానంలోనుండి బయటకు వస్తావు, అప్పటివరకు నీవు బయటకు వచ్చే

అవకాశంలేదు. ఏ వస్తువు తనంతట తానుగా ప్రకాశిస్తుందో, ఏ ప్రకాశం వలన ఈ ప్రపంచం తెలియబడుతోందో నీ మనస్సును దానిమీదపెట్టి ధ్యానిస్తే కదా ఈ రాగద్వేషములనుండి బయటకువచ్చేది. ఈశ్వరుడిని ధ్యానిస్తూ ఉంటే అహంభావన రాలిపోతుంది. సూర్యుడు ఉదయించటం, చీకటి పోవటం ఎలా జరుగుతుందో, అలాగ శవబుద్ధి నశించటం శివబుద్ధి కలగటం ఒకేసారి జరుగుతుంది. మన స్వరూపమే బ్రహ్మం, మన పేరే బ్రహ్మం, మనం బ్రహ్మం అయిఉండి బ్రహ్మంను వెతుక్కొంటున్నాము, నీవు బ్రహ్మమే అది తెలియక ఇలా వెతుక్కుంటున్నావు అని మనకు తెలియజెప్పేవాడే గురువు. మన హృదయంలో ఉన్న చైతన్యం మనకు తెలియకుండా ఏదో అడ్డువస్తోంది అని నీవు అనుకొంటున్నావు. ఏదీ అడ్డురావటం లేదు, అది కూడా ఒక తలంపే, అది కూడా కల్పితమే. ఈ కల్పిత గొడవలు తీసి ఒక ప్రక్కన పెట్టు, అదే సాధన. నీకు జ్ఞానం కలిగే రోజు వచ్చేస్తుంది, నీకు జ్ఞానం కలిగాక ఈ గొడవలు అన్నీ కల్పితాలు, నేను చేసిన సాధన కల్పితం అని నీకు తెలుస్తుంది. భగవాన్‌తో ఒక భక్తుడు నేను బాగా సాధన చేస్తున్నాను అన్నాడు. భగవాన్ అంటారు సాధన చెయ్యి, సాధన చెయ్యి సాధనలో ఏమీలేదు అని తెలిసేవరకూ సాధన చెయ్యి. జ్ఞాపకం సంసారం, మరపు సంసారం. ఎందుచేతనంటే జ్ఞాపకం పెట్టుకొనేది మనస్సు, మర్చిపోయేది మనస్సు. ఈ మనస్సే సంసారం. ఎవరైనా కాశీ వెళతాను అంటే వెళ్ళిరండి అక్కడ ఏమీలేదు అని తెలుసుకోవటానికి వెళ్ళిరండి అనేవారు. ఉన్నదంతా నీహృదయంలోనే ఉంది, బయట ఏమీలేదు అనే వారు. నీ వాసన వలన బయట ఏదో ఉందని నీకు అనిపిస్తోంది అంతే గాని బయట ఏమీలేదు. 24 గంటలు ప్రపంచాన్ని తలపెట్టుకొనే బదులు నిర్మలంగా కూర్చొని కొద్దిసేపు భగవంతుని ధ్యానించుకోవటం వలన నీకు ఎక్కువ విషయాలు తెలుస్తాయి. 1912 సం॥లో విరూపాక్ష గుహలో మొదట భగవాన్ పుట్టిన రోజు జరిగింది. మీ పుట్టిన రోజుచేసుకొంటాము అని భక్తులు భగవాన్‌ను అడిగితే ఈ శరీరం పుట్టినరోజు కాదు చేయవలసింది, ఈ శరీరము అనే తలంపు ఎక్కడపుడుతోంది అని దాని మూలాన్ని వెతకటం పుట్టిన రోజు యొక్క లక్ష్యం అన్నారు. నువ్వు 365 రోజులు విచారణ చేయటం మంచిదే. నువ్వు అలా చేయలేకపోతే కనీసం ఈ దేహం పుట్టినరోజున అయిన ఈ నేనుఅనే తలంపు ఎక్కడ పుట్టి వస్తోందో దానిని విచారణ చెయ్యి, ఇలా విచారణ చేయటమే నిజమైన పుట్టినరోజు అన్నారు.

**సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 29-12-2002, పూలపల్లి**



ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

నువ్వు జీవించిఉన్నంతకాలం నీవు చేయగలిగినంత మంచి చేస్తూఉండు. సత్పురుషులను చూసూఉంటే ఇదే వైకుంఠం అనిపిస్తుంది, కొంతమందికి ఆ వైభవాన్ని గ్రహించేశక్తిలేక ఇక్కడ ఉన్నదానిని వదిలేసి ఎక్కడో ఏదోచూస్తూ ఉంటారు. సత్వగుణం ఉన్నవారు ధన్యులు, వారు ఎక్కడికి వెళ్ళినా స్వతంత్రించుకొందురు అంటే వారు ఏదేశం వెళ్ళినా అది మనదేశమే అని వారికి అనిపిస్తుంది. అంటే మన దృష్టి అంత విశాలం అవ్వాలి. మన దృష్టి అంత విశాలమైతే అహంభావన పోతుంది. ఈ సృష్టిలో ఏదీ నాదికాదు అనుకోవటం జ్ఞానమార్గం, కనిపిస్తున్న జగత్తు అంతా నాది అనుకోవటం కర్మమార్గం. ధనం నీకు యజమానిగా ఉండకూడదు, ధనం నీకు బానిసగా ఉండాలి. ధనం నీకు యజమానిగా ఉంటే, ధనం మన మీద పెత్తనం చేస్తూఉంటే మనం మంచి పనులు చేయలేము, మన పతనం ప్రారంభమవుతుంది. ధనం మనకు బానిసగా ఉంటే మనం మంచి పనులు చేయగలము, మనం వినయంగా ఉంటాము, శాంత చిత్తముతో ఉంటాము. ధనం మనకు యజమానిగా ఉంటే అది పాపాన్ని తీసుకొని వస్తుంది. ధనం మనకు బానిసగా ఉంటే అది పుణ్యాన్ని తీసుకొని వస్తుంది. సూదిబెజ్జంలోనుండి ఒంటెను లాగగలము గాని ధనవంతుడిని స్వర్గంలోనికి పంపలేము అని బైబిలులో చెప్పాడు. ఎక్కడ ధనం ఉందో అక్కడ చెడువచ్చే అవకాశం ఉంది, అందువలన బహుజాగ్రత్తగా ఉండు అని భగవంతుడు చెప్పాడు. మనం సాధన చేసి సత్వగుణాన్ని సంపాదించుకోవాలి. సత్వగుణాన్ని సాధించలేకపోతే ఆత్మజ్ఞానసముపార్జనకు దారి కనబడదు, ఏపని చేసినా యజ్ఞభావంతో చేయాలి. చేతులతో పని చేయాలి, మనస్సుకు యజ్ఞభావం ఉండాలి. యజ్ఞభావనతో పనిచేసేవాడు పూర్ణస్థితిని పొందుతాడు. తిండిదగ్గర, నిద్ర దగ్గర అతిలేకుండా జాగ్రత్తగా ఉంటే అది శారీరకఆరోగ్యానికి మంచిది. మాటదగ్గర జాగ్రత్తగా ఉంటే అది మానసిక ఆరోగ్యానికి మంచిది. మనకు ఈ రెండు ఆరోగ్యాలు అవసరమే, ఇవి సరిగా లేకపోతే సత్యాన్వేషణ జరగదు. సత్యాన్వేషణ చేసే వారందరికి వెంటనే సత్యానుభవం కలుగకపోవచ్చు కాని అపజయం కూడా జయానికి దారితీస్తుంది. మనకు జిజ్ఞాస ఉంది, ప్రయత్నం చేస్తున్నాము, పడుతున్నాము మరల లేస్తున్నాము. కాలు జారిపడతాము అనుకోండి అలా